


# వసుమతి

## శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ గారు

వసుమతి ఒకచక్కని చిన్న సాంఘికనవల. సంఘమందుగల దురాచారముల పారద్రోలుటకు పాఠకుల ప్రబోధించుట పరిపాటి అయ్యెను. ఉపన్యాసముల మూలమున, కరపత్రములమూలమున నవలలమూలమున ప్రజల హృదయమున సంస్కారబీజములు నాటి తన్మూలమున సంస్కారఫలితము నందరకు లభించునట్లు చేయుటకు సంస్కర్తలు ప్రయత్నించుట ఆచారముగ నున్నది. కీ. శే. వీరేశలింగంపంతులుగారు మున్నగు సంఘసంస్కర్తలు ప్రహసనములు, నవలలు, నాటకములు రచియించి సంఘదురాచారముల నంతమొందించుటకు కృషిచేసిరి. సౌభాగ్యవతి వరలక్ష్మమ్మగారును అట్టి సంఘసంస్కరణార్థులలో నొక్కర్తె యనువిషయము దన ప్రథమ ప్రయత్నమగు నీ చిన్ని నవలవలన పాఠకమహాశయులకు స్పష్టముకాగలదు.

శారుగూరియందు, ఇంగ్లీషువిద్య నభ్యసించుచున్న ఆనందుడు, చెడుసహవాసమువలన వేశ్యాలోలుడై తండ్రిలేని కొరతను దీర్చుచున్న అన్నగారితో తగవులాడి, ఆస్తిని పంచుకొని గుంటూరునందు తనభార్యయగు వసుమతితో కాపురముచేయుట కేగెను. నాగమణి యనువేశ్య వసుమతిసౌందర్యమును జూచి రూపసియగుభార్య కట్టివాడేని లొంగునని అనుదినమును ఆనందుడులేని సమయమున అతని యింటికివచ్చుచు పోవుచు సమయము దొరకినప్పుడెల్ల వసుమతిపై లేనిపోనికొండెముల ఆనందునితోఁ జెప్పుచు వసుమతిజీవితమును కష్టములపాలు చేసెను. పాపము! భర్తనగలను దీసికొనినను, నిష్కారణముగ పదిమందిలో పరిభవించినను సాధ్వీమతల్లియగు వసుమతి యోర్చికొనియుండెను. అన్నయగు రామచంద్రుడు ఎన్నియోమారులు తరచిఅడిగినను ఆమె భర్త పెట్టుచున్న బాధల నింతయైన నాయనకు జెప్పకుండెను. తుదకు పొలముల తనఖాపెట్టి నాగమణితో ఆనందుడు చెన్నపురి కేగెను. చెన్నపురియందలి నూతన పరిచితులమాటపై నాగమణి ఆనందుని రంగూనునకు ప్రయాణము గట్టించెను. ధనమున్నంతకాలమును నాగమణి ఆనందుని సగౌరవముగ జూచుచుండెను. ధనహీనులు అప్పుచేసి పప్పుకూడుగుడుచు టెన్నినాళ్లు సాధ్యమగును! ధనముతోపాటు ఆనందునిపై వెలయాలి గౌరవము తగ్గనారంభించెను.

భర్తకు వసుమతియెన్నియో ఉత్తరములువ్రాయుచుండెడిది. కాని నాగమణి ఉత్తరములనన్నిటిని ఆనందునకు జూపక చింపివేయుచుండెను. తుదకానందుడు ఒక ఆంధ్రునికడ నుద్యోగమును సంపాదించెను. ఉద్యోగము నొసంగిన సుందరరావుగారు ఆనందుని జీవితరహస్యము నెరింగి ఆనందుని మంచిత్రోవను బెట్టుటకు ప్రయత్నించెను. తనవద్ద అధికముగ ధనము లేకుండుటవలనను, నాగమణి మరియొకరసికుని మరగుటవలనను ఆనందుడు వేరుగ నొకగదియం దుండవలసినవా డయ్యెను. అట్టితరి భార్యవసుమతివ్రాసిన ఉత్తరమునుజదివి ఆనందుడు మిగుల విచారము నొందెను. గృహమున కేగి వసుమతిని జూడ లయునని మనమున నాతని కాందోళనము గలిగెను. తరువాత నాత డూరుచేరి తనహృదయపరివర్తనమునకు కారకురాలగు వసుమతితోగలసి సౌఖ్యముగ సంసారము గడుపుకొనెను.

ఇందలికథ స్త్రీపాత్రములు నుచితముగ పోషింప బడినది. సందర్భోచితముగ ప్రకరణములు విభజింప బడినవి. కాని పురుషపాత్రపోషణమునందుమాత్ర మిం చుక లోపమున్నట్లు కన్పించుచున్నది. రచనమున నొప్పు లంతగా లేకున్నను సంస్కృతపదభూయిష్ఠమై యించుక ప్రౌఢముగ నున్నది. పాశ్చాత్యాచారానుసారము మన కలవాటు నందున్న కొన్ని కల్పితపదములు సృష్టింపబడి నవి. నవలారచనమున కిది ప్రథమ ప్రయత్నమగుటయే కొంత గారవము కానవచ్చును. సహవాసదోషములు, కన్యా పరశుల్కాసులం దర్శనములు, వలపుగాలి మాయలు, పవిత్ర చరిత్రలగు హైందవబాలికలను పతులపైగల ప్రేమ మొద లగునవి యింపురసవ్యముగ వర్ణింపబడినవి. మఱియు నీనవల ననేకవిషయములను నీతులను బోధించుచున్నది. ఇట్టిగ్రంథ మును నూతన ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు పఠనీయ గ్రంథములలో నొక్కటిగ పరిగణించుట సమంజసముగ నుండును. మఱియు నీరచయిత్రి గ్రంథముల రచియించి ఆంధ్రలోకముయొక్క కృతజ్ఞతకు పాత్రమగుగాక!

# ప్రణయగీతము

కొల్లూరు భద్రారావు గారు

ముత్యాలసరము:—

రమ్ము, ప్రేయసి, రమ్ము పోదము  
రమ్మురమ్మన సంటుఁగట్టుము;  
చిమ్మచీకటి గ్రమ్ము భూమి త  
లమ్మునందున సౌఖ్యమా?— రమ్ము.

కాలచక్రముచే నధోగతి  
పాలుచెందిన జగతి విడిచి, మ  
రాళయుగళమురీతి మనము, వి  
శాల జలనిధిపైఁ జరింతము;— రమ్ము.

ఐహికాముష్మికద్వంద్వము  
దేహ మొక్కట ననుభవింపఁగ  
మోహమే యూపథము గద, సం  
దేహమేటికి దానిఁగొనుటకు;— రమ్ము.

కోరికల నిడు కల్పవృక్షముఁ  
గోరనేటికిఁ బ్రణయసుఖమున,  
స్వైరసంచారము నొనర్పఁగ  
వేఱుగతి మన కెందుఁ గలుగదు;— రమ్ము.

తారకలె మన చేతిదీపిక  
లై, కళిన్ వెలుఁగొందుచుండును,  
ఆకసంబున కంటుతరఁగలె  
నాకసౌధసోపానవిధమగు;— రమ్ము.

ఉక్కుమిన్నిటిఁ జుట్టఁబెట్టుచు  
నొక్కపెట్టున వీచుగాలులు  
ప్రక్కపై శయనించు మనకై  
చక్కఁగా నొక "జోల" పాడును;— రమ్ము.

నీలిచీరను గగనమున కు  
య్యాలరీతిగఁ బ్రకృతి బాలిక  
వ్రేలునట్లుగ గట్టియుంచెను,  
బాల, మన కది తగినపానుపు;— రమ్ము.

ఇల్లు వాకిలి విడిచిపోవుట  
నొల్లనంచును బల్కెదవు,—నీ  
కిల్లు నా మదియందుఁ గట్టితి,  
చల్లగా నచ్చటఁ వసింపుము;— రమ్ము.